సాక్షి విశాఖపట్నం

శనివారం । 2 । మార్చి । 2024



తొలిరోజు ప్రశాంతం

జిల్లాలో 93 కేంద్రాల్లో ఇంటర్ మొదటి ఏడాది పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. II లో



రేపే పల్స్ పోలియో

జిల్లాలో ఈ నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఎంహెచ్‌వో తెలిపారు. II లో



సత్వరమే ఫిర్యాదుల పరిష్కారం

డయల్ యువర్ సీపీకి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సీపీ రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. II లో



ప్రగతి పరవళ్లు

ఐదేళ్లలో రూపురేఖలు మారిన భీమిలి


- వైఎస్సార్ సీపీ పాలనలో రెండు చక్రాలుగా అభివృద్ధి, సంక్షేమం
- రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.2,550 కోట్ల లబ్ధి
- కొత్తగా సమకూరిన మౌలిక సదుపాయాలు
- దీర్ఘకాలిక సమస్యలకూ పరిష్కారం



వేములవలసలో ఒకేచోట గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్

మట్టి వాసనతో చక్కటి గ్రామీణం.. ఆధునిక పోకడలతో అందమైన పట్టణం.. ఇదే భీమిలి నియోజకవర్గం. చరిత్రలో భీమిలి పేరు సువర్ణాక్షరాలతో లిఖితమైంది. భీమిలి నియోజకవర్గంలో 1952 నుంచి 2019 వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ నియోజకవర్గంలో 2019 వరకు 67 ఏళ్ల కాలంలో వివిధ పార్టీల హయాంలో జరిగిన అభివృద్ధి కంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత 2019–2024 మధ్య కాలంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టింది. 33కు పైగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ.2,550 కోట్ల వరకు లబ్ధి చేకూరింది. ఐదు లక్షల పైగా జనాభా కలిగిన అతి పెద్ద నియోజకవర్గం భీమిలిలో అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ఈ మొత్తం జమ అయింది. మరో రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి.

– తగరపువలస



తొట్లకొండపై పునర్ నిర్మించిన బౌద్ధ మహా స్థూపం



భీమిలి బీచ్‌రోడ్డు

ఒక్కొక్కరికి రూ.లక్ష పైనే లబ్ధి

నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ సగటున సంక్షేమ పథకాల ద్వారా రూ.51,008, ఓటర్‌కు రూ.101,008 లబ్ధి చేకూరగా.. అభివృద్ధి పనులతో కలిపి ఒక్కొక్కరికి రూ.72,305, ఓటర్‌కు రూ.143181 ప్రయోజనం చేకూరింది.

చకచకా రోడ్ల విస్తరణ

గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. పద్మనాభం నుంచి రెడ్డిపల్లి శాంతి నికేతన్ వరకు రూ.10.40 కోట్లతో మూడు కిలో మీటర్ల మేర రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతాలు.. కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లతో కళకళలాడుతున్నాయి. జీ–20 సదస్సు సందర్భంగా భీమిలి బీచ్‌రోడ్లకు కొత్త అందాలు వచ్చి వెలిగిపోతున్నాయి. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునికీకరించారు.



కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు రహదారి

పార్కులు భళా

ప్రజలకు ఆహ్లాదం కలిగించేందుకు గానూ పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. మధురవాడ జోన్‌లో రూ.6 కోట్లతో మూడు చోట్ల థీమ్ పార్కులను అందుబాటులోకి తీసుకొచ్చారు. భీమిలి జమ్మి చెరువు పార్కును రూ.84లక్షలు, బీచ్ పార్కును రూ.25 లక్షలతో ఆధునికీకరించారు. జీవీఎంసీ భీమిలి జోన్‌లోని 1 నుంచి 4 వార్డులకు కలిపి 182 పనులకు రూ.34.59 కోట్లు ఖర్చు చేశారు. మధురవాడ జోన్‌లోని 5 నుంచి 8 వార్డులకు గానూ 492 పనులు మంజూరు కాగా.. రోడ్లు, డ్రైయినేజీలు, శ్మశానవాటికలు, ప్రహరీలు, రక్షణగోడలు, బస్ షెల్టర్లు, ఫుట్‌పాత్‌లకు 108.44 కోట్లు ఖర్చు చేశారు.



భీమిలి జమ్మి చెరువు పార్కు

శ్మశానవాటికలకు కొత్త రూపు

శ్మశానవాటికలను కూడా నందనవనంలా తీర్చిదిద్దుతున్నారు. ప్రహరీలు నిర్మించి వసతులు కల్పిస్తున్నారు. ఇటీవల భీమిలి జోన్‌లో రూ.1.09 కోట్లతో నాలుగు శ్మశానవాటికల్లో వసతులు పూర్తి చేశారు.

47 సచివాలయాలు.. 45 ఆర్బీకేలు



స్వపరిపాలనలో భాగంగా రూ.14.95 కోట్లతో 47 గ్రామ సచివాలయాలు, రూ.9.81 కోట్లతో 45 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. భీమిలిలో రూ.75 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను రైతుల ప్రయోజనార్థం ఏర్పాటు చేశారు. మధురవాడ జోన్‌లో వసంత విహార నుంచి జీసీసీ లే అవుట్ వరకు రూ.3 కోట్లతో, సాండ్ అండ్ సాండ్ లే అవుట్ నుంచి బక్కన్నపాలెం వరకు రూ.1.40 కోట్లతో డ్రైనేజీ నిర్మించారు. కాపులుప్పాడలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రూ.4 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 2వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గొడౌన్‌ను రూ.1.20 కోట్లతో నిర్మించారు.



మధ్ది ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్

జ్యూట్ మిల్లు కార్మికులకు రూ.33 కోట్ల పరిహారం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భీమిలి డివిజన్‌లో ప్రజలకు అందుబాటులో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేశారు. 2009లో చిట్టివలస జ్యూట్‌మిల్లు లాకౌట్‌కు గురి కాగా.. అప్పటి కాంగ్రెస్, తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించలేకపోయాయి. 2019లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జోక్యంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరు వేల మంది కార్మికులకు పరిష్కారం చూపారు. ఇప్పటివరకు యాజమాన్యం నుంచి రూ.33 కోట్లకు పైగా పరిహారం ఇప్పించారు. నాలుగు దశాబ్దాల ప్రజల కలను నెరవేర్చేలా రూ.78 లక్షలతో చిట్టివలసలో రైతు బజార్‌ను నిర్మించారు. సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో రూ.74 లక్షలతో రక్షణ గోడ ఏర్పాటు చేయించారు. భీమిలి జోన్ ప్రజల తాగునీటి సమస్య తీర్చడానికి రూ.1.27కోట్లతో 350 ఎంఎం పైప్‌లైన్ నిర్మించారు. తొట్లకొండపై రూ.1.50 కోట్లతో మహా స్థూపం పునర్ నిర్మాణం, వసతులు కల్పించారు.



సొంతింటి కల నెరవేరిందిలా..

నియోజకర్గంలో 35 వేల మందికి ఇంటి పట్టాలు అందించారు. వీటి మార్కెట్ విలువ రూ.10.50 కోట్లకు పైనే ఉంటుంది. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలకు అదనంగా ఖర్చు చేశారు. ఇంకా ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున రుణసాయం అందిస్తున్నారు. ఇప్పటి వరకు 534 మందికి టిడ్కో ఇళ్లు అందించారు. మిగిలినవి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.







ఆరోగ్య భద్రతకు పెద్దపీట

రూ.3.60 కోట్లతో భీమిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆధునికీకరించారు. నియోజకవర్గంలో రూ.8.21కోట్లతో 8 పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మించి, 3 పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను అత్యాధునికంగా తీర్చిదిద్దారు. మరో 4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రూ.2.68 కోట్లతో ఆధునికీకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.6.3 కోట్లతో 36 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. నాడు–నేడు కింద 247 పాఠశాలల్లో అదనపు గదులు, ప్రహరీల నిర్మాణం, 58 అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు.

సంక్షేమ పథకాలల్లోనూ అగ్రగణ్యం

భీమిలి నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటివరకు అందిన మొత్తం వివరాలివీ..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	ఐదేళ్లలో చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
రైస్ కార్డులు జారీ	1,18,565	
వైఎస్సార్ ఆరోగ్యశ్రీకార్డులు	87,997	
వైఎస్సార్ బీమా కార్డులు	1,01,444	
వైఎస్సార్ పింఛన్ కానుక	45,575	282.93
ఇళ్ల పట్టాలు	35,000	1050.00
వైఎస్సార్ రైతు భరోసా	24,925	112.62
అమ్మఒడి	4,4617	202.89
జగనన్న విద్యా దీవెన	10,763	102.31
జగనన్న వసతి దీవెన	9,462	29.4
వైఎస్సార్ చేయూత	31,626	181.64
జగనన్న చేయూత(దర్జీ)	1,605	6.40
జగనన్న చేయూత(రజకులు)	1,263	5.00
జగనన్న చేయూత (నాయీబ్రాహ్మణులు)	801	3.20
వైఎస్సార్ వాహనమిత్ర	5,404	21.61
కోవిడ్–19 ఆసరా	97,734	9.77
పాస్టర్లకు గౌరవ వేతనం	189	0.37
అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లింపు	6151	12.30
జగనన్న గోరుముద్ద	33,067	32.40
వైఎస్సార్ కంటి వెలుగు	42,901	
వైఎస్సార్ ఆసరా	53,533	155.85
సున్నా వడ్డీ	61,458	22.39
వైఎస్సార్ బీమా పరిహారం	470	5.85
జగనన్న తోడు	12,165	24.64
స్త్రీనిధి	6,390	40.12
వైఎస్సార్ కాపు నేస్తం	1,344	6.65
ఈబీసీ నేస్తం	2,611	6.84
బ్యాంకు లింకేజీ రుణాలు	27,012	197.65
జగనన్న విద్యాకానుక	44,617	32.12
మత్స్యకార భరోసా	5,191	5.19

సంతృప్తికరంగా ఐదేళ్ల పాలన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో భీమిలి నియోజకవర్గంలో ఈ ఐదేళ్లు ప్రజలకు సంతృప్తికరంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించగలిగాను. నియోజకవర్గంలోని 127 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా తిరిగి 3.50 లక్షల ఓటర్లను ప్రత్యక్షంగా కలిశాను. వారి సమస్యలు విని పరిష్కరించాను. ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి ఇచ్చిన రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి చేశాం. చిట్టివలసలో రైతు బజారును ప్రారంభించాం. పాండ్రంగి వద్ద గోస్తనీనదిపై వంతెన, అనంత పద్మనాభస్వామి ఘాట్‌రోడ్డు పనులు పూర్తి చేస్తాం. సింహాచలం పంచ గ్రామాల సమస్య కోర్టు పరిధిలో ఉంది. ఈ సమస్యను కూడా ముఖ్యమంత్రి చొరవతో పరిష్కరించి అక్కడి ప్రజలకు న్యాయం చేస్తాను.

– ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

జోరుగా పింఛన్ల పంపిణీ

తొలిరోజు 58.23 శాతం పంపిణీ



24వ వార్డు నక్కవానిపాలెంలో సూర్యకాంతానికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కాంతం

మహారాణిపేట: వైఎస్సార్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ శుక్రవారం జోరుగా ప్రారంభమైంది. జిల్లాలో 1,65,891 లక్షల మందికి వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్లు ఉన్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.50.10 కోట్లు విడుదల చేసింది. రాత్రి 8 గంటల సమయానికి 96,591 మందికి (58.23 శాతం) పింఛను పంపిణీ పూర్తి చేశారు. వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ వేగంగా జరుగుతోందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి తెలిపారు. ఈ పింఛన్ల పంపిణీ ప్రక్రియ ఐదు రోజుల పాటు జరుగుతుందన్నారు.



25వ వార్డులో అప్పారావుకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నీలవేణి

విశాఖ అభివృద్ధికి కృషి చేస్తా..

- పార్టీ కోసం కష్టపడే వారికి సీఎం జగన్ గుర్తిస్తారు
- అందుకు తానే నిదర్శనం
- వీఎంఆర్డీఏ ప్రగతిలో భాగస్వాముడినవుతా..
- వైఎస్సార్ సీపీ విజయానికి త్రికరణశుద్ధితో పాటు పడతా..
- వీఎంఆర్డీఏ చైర్మన్ చంద్రమౌళి



వీఎంఆర్డీఏ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రమౌళి, చిత్రంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి, కె.కె.రాజు

విశాఖ సిటీ: విశాఖ అభివృద్ధికి, వీఎంఆర్డీఏ ప్రగతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి అన్నారు. వీఎంఆర్డీఏ నూతన చైర్మన్‌గా శుక్రవారం ఆయన పదవి చేపట్టారు. ముందుగా మాధవధార ప్రాంతం నుంచి భారీ రాలీగా బయలుదేరి కార్యాలయానికి చేరుకున్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తోడురాగా.. చైర్మన్ చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన తాను అంచెలంచెలుగా ఎదిగానని చెప్పారు. కళింగ సామాజిక వర్గానికి చెందిన తనను గుర్తించినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ పరిపాలన రాజధాని కానున్న క్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వీఎంఆర్డీఏకు చైర్మన్‌గా చేసి మహోత్తరమైన బాధ్యతను అప్పగించారని సంతోషం వ్యక్తం చేశారు. విశాఖ అభివృద్ధికి కీలకమైన ప్రాజెక్టులపై దృష్టి సారించడంతో పాటు మధ్య తరగతి ప్రజల కోసం అభివృద్ధి చేసిన లేఅవుట్లలో వారికి బ్యాంకు రుణాలతో ప్లాట్లు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం అయ్యేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

బలహీన వర్గాలకు పదవులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంక్షేమ పథకాల అందించడమే కాకుండా వారికి రాజకీయ పదవులు అందిస్తూ సమాజంలో గౌరవమైన జీవితాన్ని కల్పించారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. మరో 30 ఏళ్లు జగన్ సీఎంగా ఉంటే వెనుకబడిన వర్గాలన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు. పార్టీ జెండా మోసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా సీఎం జగన్ గౌరవం, గుర్తింపు కల్పిస్తారని స్పష్టం చేశారు. ఇతర పార్టీల మాదిరిగా వైఎస్సార్ సీపీ వదిలేయదన్నారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కె.సతీష్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగన్‌నే మళ్లీ సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రంథాయల సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసే వారిని ముఖ్యమంత్రి జగన్ గుండెల్లో పెట్టుకుంటారనడానికి సనపల చంద్రమౌళి నియామకమే నిదర్శనమన్నారు. వీఎంఆర్డీఏ చైర్మన్‌ను నియమించకుండా చంద్రబాబు తన కబంద హస్తాల్లో పెట్టుకోగా.. సీఎం జగన్ ఇప్పటి వరకు ముగ్గురు చైర్మన్లను నియమించారని తెలిపారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి మాట్లాడుతూ చంద్రమౌళి క్రియాశీలక కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి.. ఇప్పుడు కీలకమైన వీఎంఆర్డీఏ చైర్మన్‌గా ఎదగడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఆయన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సన్మానించారు. కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ వందన సమర్పణ చేయగా జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి, ఎస్సీ సెల్ కార్యదర్శి బోని శివరామకృష్ణ, కార్పొరేటర్ వంశీరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం

- పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు
- ఫస్టియర్‌కు 98 శాతం హాజరు


పరుగు పెడుతున్న విద్యార్థి


ఆల్ ద బెస్ట్ తల్లీ..

విశాఖ విద్య: జిల్లాలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 93 కేంద్రాల్లో తొలిరోజు సెకండ్ లాంగ్వేజి (తెలుగు/ సంస్కృతం) పరీక్ష జరిగింది. విద్యార్థులను కేంద్రాల్లోకి అరగంట ముందు నుంచే అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. తొలిరోజు కావటంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, వారి సహాయకులు కేంద్రాల వద్దకు తోడుగా వచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడిగా కనిపించింది. కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించారు. అన్ని కేంద్రాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

98 శాతం హాజరు

ఫస్టియర్ జనరల్ కోర్సుకు 40,566 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 566 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు 1,671 మందికి గాను 95 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 42,237 మంది విద్యార్థులకు 41,576 మంది పరీక్షకు హాజరయ్యారు. 98 శాతం మంది పరీక్ష రాసినట్లు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.మురళీధర్ వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆర్ఐవో కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి, అధికారులు పర్యవేక్షణ చేశారు. తొలిరోజు ఎటువంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు.


పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినులు


పరీక్ష కేంద్రం వద్ద సందడి

నేడు సెకండ్ ఇయర్ పరీక్ష

శనివారం ఇంటర్ సెకండర్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 172 జూనియర్ కాలేజీల్లో చదువుతున్న 41,892 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 21,800 మంది, బాలికలు 20,092 మంది ఉన్నారు.

హాల్ టికెట్లు ఇవ్వని కాలేజీలపై ఆరా

ఫీజు బకాయిలుతో పనిలేకుండా హాల్ టికెట్లు ఇవ్వాల్సిందేనని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. వెబ్‌సైట్ నుంచి నేరుగా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. అయినా జిల్లాలోని కొన్ని కాలేజీల నిర్వాహకులు ఫీజు వసూళ్ల కోసమని విద్యార్థులను ఇబ్బందులు గురిచేశారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై ఇంటర్ బోర్డు అధికారులు ఆరా తీస్తున్నారు.

ఒక్క ఫోన్ కాల్‌తో...

కదిలొచ్చిన సీపీ.. వృద్ధురాలికి భరోసా

- డయల్ యువర్ సీపీకి 94 ఏళ్ల వృద్ధురాలు ఫోన్
- తన స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు
- వెంటనే స్పందించి ఆమెను తీసుకొని వివాద స్థలానికి వెళ్లిన కమిషనర్
- అక్కడికక్కడే విచారణ జరిపి న్యాయం చేసిన సీపీ రవిశంకర్
- ఈ నెల 6న భూవివాద ఫిర్యాదుల స్వీకరణకు ఒక్కో స్టేషన్‌కు ఒక్కో అధికారి


వృద్ధురాలితో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: 94 ఏళ్ల వృద్ధురాలు.. తన స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని కమిషనర్ రవిశంకర్‌కు ఒక్క ఫోన్ కాల్ చేసింది. తక్షణమే సీపీ ఆమె ఇంటి వద్ద ప్రత్యక్షమయ్యారు. ఆమెను వెంట తీసుకొని స్థలాన్ని పరిశీలించారు. అక్కడికక్కడే ఆమెకు న్యాయం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఎప్పటిలాగే శుక్రవారం «డయల్ యువర్ సీపీ» కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు నిర్వహించారు. వృద్ధుల కోసం కేటాయించిన మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల సమయంలో ఎండాడ ప్రాంతానికి చెందిన 94 ఏళ్ల వృద్ధురాలు ఎ.యు.భాస్కరదేవి ఫోన్ చేసింది. మధురవాడలో ఉన్న తన స్థలాన్ని కొంత మంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొంది. వెంటనే సీపీ స్పందించారు. జాయింట్ సీపీ ఫకీరప్ప, సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్.వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి టి.ఎస్.ప్రసాద్‌తో కలిసి క్షణాల్లో వృద్ధురాలి ఇంటికి వెళ్లారు. ఆమెను వెంట తీసుకొని మధురవాడలో ఉన్న స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. వెంటనే దీనిపై విచారణ చేయాలని స్థానిక పోలీస్ అధికారులను ఆదేశించారు. అక్కడికక్కడే ఆమెకు స్థలాన్ని అప్పగించి సమస్యను పరిష్కరించారు. ఒక్క ఫోన్ కాల్‌తో తనకు న్యాయం చేసిన పోలీస్ కమిషనర్ రవిశంకర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

కబ్జాదారులపై పీడీ యాక్ట్ నమోదు

నగరంలో భూఆక్రమణలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. అటువంటి వారిని గుర్తించి హెచ్చరించాలని, అప్పటికీ మారకపోతే పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు అవసరమైతే నగర బహిష్కరణకు సిఫార్సు చేయాలని చెప్పారు.

6న భూఆక్రమణల ఫిర్యాదుల స్వీకరణ

నగరంలో భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండడంతో సీపీ వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ భూ వివాదాల కారణంగా కొన్ని సందర్భాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని గుర్తించారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించి ఆ దిశగా చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇందులో భాగంగా భూ కబ్జాలు, వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ నెల 6వ తేదీన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వీకరించనున్నారు. జాయింట్ సీపీ, డీసీపీల నుంచి ఏసీపీల వరకు నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒక్కో స్టేషన్‌కు ఒక్కో అధికారిని నియమించారు. వీరే స్వయంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. భూ వివాదాలకు సంబంధించి బాధితులు ఎవరైనా ఉంటే వారు 6న ఆయా స్టేషన్లలో అందుబాటులో ఉండే పోలీస్ అధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే కబ్జాదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాన్ ఫేర్ రెవెన్యూలో వాల్తేర్ డివిజన్ రికార్డు


వివరాలు వెల్లడిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: నాన్ ఫేర్ రెవెన్యూ(టికెటేతర ఆదాయం)లో వాల్తేర్ డివిజన్ నూతన రికార్డులను నెలకొల్పిందని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం(ఏప్రిల్ 2023–ఫిబ్రవరి 2024) వరకు 48 శాతం అధికంగా 7.61కోట్లు ఆర్జించినట్లు వెల్లడించారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో ఎయిర్ కండిషన్డ్ లాంజ్‌లు, కోచ్ రెస్టారెంట్లు, బైక్ రెంటల్స్, వందేభారత్ రైలులో ప్రకటనల ద్వారా ఈ ఆదాయం సమకూరిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని స్టేషన్లలో ఫుడ్ కోర్టులు, కమర్షియల్ జోన్, బ్యాగేజ్ స్కానింగ్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. విశాఖపట్నంలో ప్రారంభించిన కోచ్ రెస్టారెంట్ విజయవంతంగా నడుస్తోందన్నారు.

సత్వరమే ఫిర్యాదుల పరిష్కారం

- డయల్ యువర్ సీపీకి 22 మంది ఫిర్యాదులు

విశాఖ సిటీ : డయల్ యువర్ సీపీకి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీపీ తన చాంబర్ నుంచి డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 22 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను సీపీకి విన్నవించారు. అలాగే వృద్ధుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు వృద్ధుల కోసం కేటాయించిన సమయంలో 8 ఫిర్యాదులు చేశారు. కాలర్స్ నుంచి ఫిర్యాదులు స్వీకరించిన సీపీ వెంటనే సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమస్య పరిష్కారానికి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గతంలో జరిగిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 12, అలాగే సీనియర్ సిటిజన్స్‌కు సంబంధించి 8 ఫిర్యాదులు రాగా.. సీపీ స్వయంగా వాటిపై చొరవ తీసుకొని పరిష్కరించారు. ప్రతి నెలా 1, 15 తేదీల్లో నిర్వహించే ఈ డయల్ యువర్ సీపీకి ఫిర్యాదు చేయాలనుకునే వారు 0891–2523408 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే సీపీ వాట్సాప్ నెంబర్ 9493336633కు ఫొటోలు, వీడియోలతో కూడిన ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

కార్డుదారులకు రాగి పిండి

విశాఖ సిటీ: తెల్ల రేషన్‌కార్డుదారులకు ఈ నెల నుంచి బియ్యం, పంచదార, గోధుమపిండితో పాటు రాగిపిండి కూడా అందిస్తున్నట్లు జేసీ మయూర్ అశోక్ తెలిపారు. అయితే ఒక కేజీ బియ్యానికి బదులుగా ఒక కేజీ రాగి పిండిని కిలో రూ.11కు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉన్నత చదువులకు భరోసా


విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న జేసీ అశోక్, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జిల్లా అధికారులు

- రూ.34.73 కోట్ల విద్యా దీవెన నిధుల విడుదల
- జిల్లాలో 44,177 మంది విద్యార్థులకు ప్రయోజనం

విశాఖ విద్య: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసాగా నిలిచేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తోంది. ఈ మేరకు 2023 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు గల త్రైమాసికానికి జగనన్న విద్యా దీవెన నిధుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రు నుంచి ప్రారంభించగా, జిల్లాలో కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరం నుంచి జేసీ కె.మయూర్ అశోక్.. అధికారులు, విద్యార్థులతో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే 44,177 మంది విద్యార్థులు, తల్లుల ఉమ్మడి ఖాతాల్లో రూ.34,72,64,615 నిధులు జమ అయినట్లు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని.. ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జగనన్న విద్యాదీవెన నిధుల నమూనా చెక్కును తల్లులు, విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యాత సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె.రామారావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.శ్రీదేవి, ఇతర అధికారులు, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

విద్యా దీవెనలో లబ్ధి ఇలా..

విభాగం	మొత్తం విద్యార్థులు	పొందిన లబ్ధి(కోట్లలో)
బీసీ వెల్ఫేర్		
బీసీ	32,246	25,10,09,570
ఈబీసీ	4,449	3,68,14,450
కాపు	1,332	1,09,18,141
ఎస్సీ వెల్ఫేర్	4,431	3,45,71,018
ఎస్టీ వెల్ఫేర్	217	16,21,152
మైనారిటీ వెల్ఫేర్		
క్రిస్టియన్	221	21,12,804
ముస్లిం	1,291	1,02,17,480

రేపే పల్స్ పోలియో

2,65,820 డోసుల టీకాలు సిద్ధం

మహారాణిపేట: జిల్లాలో ఈ నెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1,002 పోలింగ్ కేంద్రాలు, 74 మొబైల్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఐదేళ్ల లోపు 2,08,163 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం కోసం 4,220 మంది వ్యాక్సినేటర్లు, 92 మంది పర్యవేక్షణ సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 106 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించామని, ఈ ప్రాంతాల్లోని 767 మంది చిన్నారులకు 74 మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఈ నెల 4, 5, 6వ తేదీల్లో జీవీఎంసీ పరిధిలో 2,004 బృందాలు 6,51,702 గృహాలను సందర్శిస్తాయని చెప్పారు. జిల్లాలో మొత్తం 2,65,820 డోసుల పోలియో టీకాలు అందుబాటులో ఉన్నాయని డీఎంహెచ్‌వో వివరించారు. తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలను పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుణుపూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: నౌపడ–పర్లాకిమిడి సెక్షన్ మధ్య జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే విశాఖపట్నం–గుణుపూర్ పాసింజర్ స్పెషల్ రైలు ఆది, బుధవారాలలో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం 08522/08521) పాసింజర్ స్పెషల్ ఈ నెల 3,6,10,13,17,20,24,27,31 తేదీల్లో ఇరువైపులా రద్దయినట్లు పేర్కొన్నారు.

'ఎంఎస్ఎంఈ కోసం ర్యాంప్ పథకం'


సజ్జా పాండురంగ ప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: ఎంఎస్ఎంఈల పనితీరు మెరుగు పర్చడం, అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే పథకం ప్రకటించిందని వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో అమలు చేస్తున్న ఈ పథకాన్ని రాష్ట్రంలో పరిశ్రమలు శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫిబ్రవరి 14న ప్రారంభించారని గుర్తు చేశారు. అదే రోజున ఏపీ ఎంఎస్ఎంఈ వన్ అనే ఏకీకృత పోర్టల్‌ను ప్రారంభించారన్నారు. ఉత్పత్తుల తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని అన్నీ ఎంఎస్ఎంఈలను సర్వే చేసి.. ఆ వివరాలను ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానిస్తారని తెలిపారు. ఈ సర్వే కోసం ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు సచివాలయ కార్యదర్శులు ఈ సర్వే చేపడతారని, సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం పర్యవేక్షిస్తుందని తెలిపారు.

ఈవెంట్ కెమెరామెన్‌లపై శరగడం బంధువుల వీరంగం

- పెళ్లి వీడియో ఫుటేజీ వివాదంపై బంధించి భౌతికదాడి
- దాదాపు 8 గంటల పాటు నిర్బంధంలో బాధితులు
- దాడికి పాల్పడిన చైతన్య, స్నేహితులపై కేసు నమోదు

పెందుర్తి: పెందుర్తి నడిబొడ్డున మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు కుమారుడి స్నేహితులు, బంధువులు రెచ్చిపోయారు. శరగడం కుమారుడి వివాహాన్ని షూట్ చేయడానికి హైదరాబాద్ నుంచి వచ్చిన ఈవెంట్ ప్రతినిధులపై తీవ్ర స్థాయిలో దాడికి పాల్పడి.. దాదాపు 8 గంటల పాటు నిర్బంధించారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలివి.. పెందుర్తి నివాసి అయిన మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు చిన్న కుమారుడు పవన్‌భరత్ పెళ్లి గురువారం రాత్రి జరిగింది. పెళ్లి వీడియో, ఫొటో షూట్ చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన జీరో గ్రావిటీ ఫొటోగ్రఫీ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి సంస్థకు చెందిన కీర్తన్, సతీష్, నిఖిల్, సాయికిరణ్, ఇతర సభ్యులు పెళ్లి షూట్ చేశారు. పెళ్లి తంతు ముగిసిన తరువాత అర్ధరాత్రి 3 గంటల సమయంలో శరగడం బంధువు చైతన్య, అతని స్నేహితులు ఈవెంట్ బృందం వద్దకు వచ్చి పెళ్లి మొత్తం ఫుటేజ్ తక్షణమే కావాలని డిమాండ్ చేశారు. వెంటనే ఫుటేజీ ఇవ్వలేమని వారు తిరస్కరించారు. దీంతో రెచ్చిపోయిన చైతన్య, అతడి స్నేహితులు ఈవెంట్ బృందంపై దాడికి పాల్పడ్డారు. వెంటనే వారిని తమ కార్లలో ఎక్కించి ఏయూ సమతా బ్లాక్‌కు కొందరిని, పెందుర్తిలోని సోనికా గ్రాండ్ లాడ్జికి కొందరిని తరలించి బంధించారు. వారి వద్ద ఉన్న వీడియో ఫుటేజీని లాక్కొని శుక్రవారం మధ్యాహ్నం విడిచిపెట్టారు. వెంటనే బాధితులు హైదరాబాద్‌లోని తమ యజమానికి సమాచారం అందించడంతో హుటాహుటిన పెందుర్తి చేరుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన లైఫ్‌గార్డులు


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి వివరాలు సేకరిస్తున్న పోలీస్

అల్లిపురం: నోవాటెల్ సమీపంలో సముద్రంలో దిగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని జీవీఎంసీ లైఫ్‌గార్డులు రక్షించారు. వివరాలివీ.. రాయవరానికి చెందిన 32 ఏళ్ల బాదంపల్లి శ్రీనివాస్ అప్పుల బాధలు తాళలేక మద్యం తాగి నోవాటెల్ ఎదురుగా సముద్రంలో దిగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న జీవీఎంసీ లైఫ్‌గార్డులు టి.పోలిరాజు, టి.కల్యాణ్, కేపీసీ వాసు స్పందించి.. అతన్ని ప్రాణాలతో రక్షించారు. అతన్ని మందలించి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. సకాలంలో స్పందించి ఒకరి ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అభినందించారు.

కేశ ఖండనశాలలో ఊడిన శ్లాబ్ పెచ్చు

- భక్తులెవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం
- క్యూకాంప్లెక్స్ భవనంలోకి కేశఖండన శాల మార్పు


ఊడిన పెచ్చుభాగం

సింహాచలం: సింహగిరిపై కేశ ఖండనశాల భవనంలో శ్లాబ్ పెచ్చులూడిన సంఘటన శుక్రవారం జరిగింది. భక్తులు బయటకు వెళ్లే ద్వారానికి దగ్గరలో ఉదయం 10 గంటల సమయంలో శ్లాబ్ పెచ్చు ఊడిపోయింది. భక్తులు రద్దీ లేకపోవడం, పెచ్చులు పడిన చోట ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. కేశఖండనశాల భవనం శ్లాబ్ లోపలి భాగం శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్నాళ్ల కిందట మళ్లీ కొత్త లేయర్ వేశారు. ఆ లేయర్ భాగమే ఇప్పుడు ఊడిపోయింది. సమాచారం అందుకున్న ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి భవనాన్ని పరిశీలించి.. వెంటనే మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కేశఖండనశాలను ఇటీవలే నిర్మించిన క్యూ కాంప్లెక్స్ భవనంలోకి మార్పు చేస్తామని ఈవో తెలిపారు.